క్లుప్తంగా

అటవీశాఖ రేంజ్ కార్యాలయానికి తాళం



తాళం వేస్తున్న మున్సిపల్ అధికారి

చెన్నూర్: మంచిర్యాల జిల్లా చెన్నూర్ పట్టణంలోని అటవీ శాఖ రేంజ్ కార్యాలయం ఆస్తి పన్ను చెల్లించకపోవడంతో మున్సిపల్ అధికారులు సోమవారం మధ్యాహ్నం తాళం వేశారు. ఆస్తి పన్నులు రూ.3.43లక్షలు బకాయి ఉండడంతో కమిషనర్ మురళీకృష్ణ ఆధ్వర్యంలో చర్యలు తీసుకున్నారు. ప్రతియేటా నోటీసులు అందిస్తున్న ఫలితం లేకుండా పోతోందని కమిషనర్ తెలిపారు. ఆస్తి పన్ను వసూళ్లలో భాగంగా నిబంధనల ప్రకారం ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తాళం వేశామని పేర్కొన్నారు. పన్నులు చెల్లిస్తేనే తాళం తీస్తామని స్పష్టం చేశారు. సాయంత్రం ఆరు గంటల ప్రాంతంలో రెండ్రోజుల్లో బకాయిలు చెల్లిస్తామని ఉన్నతాధికారుల నుంచి హామీ రావడంతో తాళం తీశారు.

నేరాల నియంత్రణలో సీసీ కెమెరాల పాత్ర కీలకం



సీసీ కెమెరాలు ప్రారంభిస్తున్న డీసీపీ భాస్కర్

బెల్లంపల్లి: నేరాల నియంత్రణ, నిందితులను గుర్తించడంలో సీసీ కెమెరాలు కీలకంగా పని చేస్తాయని మంచిర్యాల డీసీపీ ఎగ్గడి భాస్కర్ అన్నారు. సోమవారం బెల్లంపల్లి కూరగాయల మార్కెట్‌లో కొత్తగా ఏర్పాటు చేసిన 16 సీసీ కెమెరాలను కూరగాయల వ్యాపారులు, ఏసీపీ రవికుమార్‌తో కలిసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌హెచ్‌వో దేవయ్య, మార్కెట్ అసోసియేషన్ నిర్వాహకులు, వ్యాపారులు, మహిళలు పాల్గొన్నారు.

కొబ్బరి బోండాల దొంగలు

మందమర్రిరూరల్: మండలంలోని మామిడిగట్టు గ్రామంలో కొబ్బరి బోండాల దొంగలు హల్‌చల్ సృష్టిస్తున్నారు. రామకృష్ణాపూర్‌కు చెందిన ఓ మహిళకు సంబంధించిన మామిడి తోట, కొబ్బరి చెట్లను మామిడిగట్టుకు చెందిన కాంతారావు చూసుకుంటున్నాడు. రెండు మూడు రోజుల క్రితం గుర్తు తెలియని కొందరు వ్యక్తులు కొబ్బరి బోండాలను దొంగతనంగా కోసుకుని వెళ్లారు. ఇలాంటి సంఘటనలు నాలుగైదుసార్లు జరిగాయని, ఈ విషయమై రామకృష్ణాపూర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తామని కాంతారావు పేర్కొన్నాడు. కాగా, మామిడిగట్టులో దొంగతనాలు బాగా జరుగుతున్నాయని, కూడళ్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి నేరాలను అరికట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ముగిసిన క్రికెట్ టోర్నమెంట్



విజేతగా నిలిచిన దాంపూర్ జట్టు

భీమారం: మండలంలోని దాంపూర్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన క్రికెట్ టోర్నమెంట్ సోమవారం ముగిసింది. భీమారం –దాంపూర్ జట్ల మధ్య జరిగిన ఫైనల్ పోటీల్లో దాంపూర్ టీం విజయం సాధించింది. విజేతగా నిలిచిన దాంపూర్ జట్టుకు చోగొండ కుమార్ రూ.20వేలు, రన్నరప్‌గా నిలిచిన భీమారం జట్టుకు జిల్లా కాంగ్రెస్ నాయకులు చేకూర్తి సత్యనారాయణరెడ్డి నగదు బహుమతులతో పాటు మెమొంటోలు అందజేశారు. వారం రోజుల పాటు జరిగిన టోర్నమెంట్‌లో వివిధ ప్రాంతాల నుంచి మొత్తం 32టీం లు పాల్గొన్నాయి. ముగింపు కార్యక్రమంలో మాజీ సర్పంచ్ భాస్కర్ రెడ్డి, సింగిరెడ్డి చిన్న గంగారెడ్డి, ప్రభాకర్ రెడ్డి, మాజీ ఉపసర్పంచ్ రవి తదితరులు పాల్గొన్నారు.

తప్పిన ప్రమాదం




భీమిని: మండల కేంద్రంలో రోడ్డు పనులు నిర్వహిస్తుండగా సోమవారం కంకర రోడ్డుతో వెళ్తున్న లారీ దిగబడింది. అక్కడే విద్యుత్ స్తంభం ఉండగా, పెను ప్రమాదం తప్పింది.

బిల్కగూడెం.. అభివృద్ధికి దూరం



గూడెం మొత్తానికి ఒక్కటే చేతిపంపు

- 17 కుటుంబాలకు ఒక్కటే చేతిపంపు
- భగీరథ నీరు కూడా అందక అవస్థలు
- ఏళ్లు గడుస్తున్నా అసంపూర్తిగా ఇందిరమ్మ ఇళ్లు



గూడేనికి వెళ్లే రోడ్డు..

దండేపల్లి: ప్రభుత్వాలు మారుతున్నాయి.. పాలకులు మారుతున్నారు.. అయినప్పటికీ దండేపల్లి మండలం లింగాపూర్ జీపీ పరిధిలోని బిల్కగూడెం మాత్రం అభివృద్ధికి దూరంగానే ఉండిపోయింది. అధికారుల పర్యవేక్షణ కొరవడడంతో గ్రామంలో సమస్యలు రాజ్యమేలుతున్నాయి.

17కుటుంబాలకు ఒక్కటే చేతిపంపు..

గూడెంలో సుమారు 17కుటుంబాలు, పిల్లలు పెద్దలు అంతా కలుపుకొని 80కి పైగా జనాభా నివాసం ఉంటారు. వీరికి ఒక్కటే చేతిపంపు ఉండగా, అన్ని అవసరాలకు ఆ నీటినే వాడుకుంటారు. ఇంటింటికీ భగీరథ నల్లా కనెక్షన్లు ఉన్నప్పటికీ నీళ్లు రాక అవి నిరుపయోగంగా మారాయి.

కానరాని రోడ్లు, డ్రైయినేజీలు..

గూడెంలో రోడ్లు లేవు, డ్రైయినేజీలు అసలే లేవు. దీంతో వానాకాలం ఇబ్బందులు అనేక అవస్థలు పడాల్సి వస్తోందని ప్రజలు వాపోతున్నారు. రోడ్డు లేకపోవడంతో పొలం గట్టు నుంచే గ్రామానికి వెళ్లాలి. ఇందిరమ్మ పథకంలో ఇళ్లు ఇచ్చినా, ఇవ్వని చందంగానే మారాయి. వైఎస్సార్ ప్రభుత్వ హయాంలో గ్రామంలోని గిరిజనులకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యాయి. వాటిని గిరిజనులు నిర్మించుకునే స్థోమత లేకపోవడంతో, ఓ గుత్తెదారు ఇండ్లు నిర్మించి ఇస్తానని చెప్పి అసంపూర్తిగా నిర్మించి వదిలేశాడు. కొన్నింటికి బేసిమెంట్ కట్టి వదిలేయగా, మరికొన్నింటికి గోడల వరకు నిర్మించి వదిలేశాడు. దీంతో ఆర్థిక స్థోమత లేని వారు అట్లాగే వదిలేయగా, కొందరు ఇంటి నిర్మాణాలను పూర్తిచేసుకొని అందులో నివాసం ఉంటున్నారు. మరుగుదొడ్లు లేనే లేవు. అధికారులు గ్రామాన్ని సందర్శించి తమ సమస్యలు పరిష్కరించి, వసతులు కల్పించాలని గిరిజనులు కోరుతున్నారు.

బోరింగ్ నీళ్లే దిక్కు..



ఇంటింటికీ నల్లా కనెక్షన్ ఇచ్చింన్రు కానీ నీళ్లు మాత్రం రావు. దీంతో తాగేందుకు, స్నానాలకు, అన్నింటికీ బోరింగ్ నీళ్లనే వాడుకుంటాం. ఇంకో బోరింగ్ ఉన్నప్పటికీ అది పాడై రెండేళ్లయిన దానిని మంచిగ చేపియ్యలే. – రాజమణి

అన్నీ సమస్యలే..



మా గూడెంలో అన్నీ సమస్యలే ఉన్నాయి. ఎవరూ పట్టించుకుంటలేరు. రోడ్డు సక్కగ లేదు. నీళ్లకు లైను కట్టుడే, కొంతమంది ఇండ్లు సక్కగ లేవు. సమస్యలతో చాలా ఇబ్బంది పడుతున్నాం. అధికారులు, పాలకులు పట్టించుకొని సమస్యలు పరిష్కరించి, సౌకర్యాలు కల్పించాలి. – ముడితే రమేశ్

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తా..

బిల్కగూడెం సమస్యలను పరిశీలించి, వాటి పరిష్కారం కోసం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తా. – ప్రసాద్, ఎంపీడీవో, దండేపల్లి

క్షయ నిర్మూలనకు కృషి చేయాలి



ర్యాలీ తీస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

చెన్నూర్: క్షయ వ్యాధి నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సామాజిక ఆరోగ్య కేంద్రం సూపరింటెండెంట్ సత్యనారాయణ అన్నారు. ప్రపంచ క్షయ వ్యాధి నిర్మూలన దినోత్సవం సందర్భంగా సామాజిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో ప్రజలకు అవగాహన కల్పించారు. ర్యాలీ నిర్వహించి ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో హెచ్ఈవో జగదీశ్, వైద్యులు రత్న బాస్కర్‌రెడ్డి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

క్షయవ్యాధిపై అవగాహన ర్యాలీ

జన్నారం: ప్రపంచ క్షయవ్యాధి దినోత్సవం సందర్భంగా సోమవారం జన్నారం మండలం తపాలపూర్ ఉన్నత పాఠశాల, తిమ్మాపూర్ ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులు క్షయవ్యాధిపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఎల్ హెచ్‌పీ సందీప్, ఆరోగ్య అసిస్టెంట్ కమలాకర్, పాఠశాల ఉపాధ్యాయులు తిరుపతి, తుంగూరు గోపాల్, శ్రీనివాస్, రాజిరెడ్డి పాల్గొన్నారు.

'ప్రజావాణి'లో వినతుల వెల్లువ

- భూ సమస్యలపై ఎక్కువ సంఖ్యలో దరఖాస్తులు
- అర్జీలు స్వీకరించిన అధికారులు



భీమారంలో దరఖాస్తులు స్వీకరిస్తున్న అధికారులు

నెన్నెల/కాసిపేట/చెన్నూర్‌రూరల్/భీమారం/దండేపల్లి/తాండూర్/వేమనపల్లి/మంచిర్యాలరూరల్ (హాజీపూర్): మండల కేంద్రాల్లో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి వినతులు వెల్లువెత్తాయి. పెన్షన్ మంజూరు కాలేదని, భూ సమస్యలు పరిష్కరించాలని, కాలువల్లో పేరుకుపోయిన చెత్త తొలగించాలని అర్జీలు రాగా, అధికారులు దరఖాస్తులు స్వీకరించారు. నెన్నెలలో కోణంపేట గ్రామానికి చెందిన దుర్గం లక్ష్మీబాయి భర్త చనిపోయి మూడు సంవత్సరాలు గడిచినా, ఇంత వరకు వితంతు పెన్షన్ మంజూరు కాలేదని దరఖాస్తు ఇవ్వగా ఎంపీడీవో దేవేందర్‌రెడ్డి స్వీకరించారు. కాసిపేటలో భూ సమస్యలపై 6 దరఖాస్తులు, ఇతర అంశాలపై 2 దరఖాస్తులు వచ్చినట్లు తహసీల్దార్ భోజన్న తెలిపారు. చెన్నూర్‌లో ఒక్క ఫిర్యాదు కూడా రాలేదు. భీమారంలోని ఆరెపల్లి ఎర్రచెరువుకి చెందిన కాలువల్లో పేరుకుపోయిన చెత్తను తొలగించాలని అదే గ్రామానికి చెందిన అడ్వకేట్ బండారి శ్రీనివాస్ ఫిర్యాదు చేశారు. దండేపల్లి, కన్నెపల్లి గ్రామాల నుంచి భూసమస్యలకు సంబంధించి రెండు అర్జీలు వచ్చినట్లు తహసీల్దార్ సంధ్యారాణి తెలిపారు. తాండూర్‌లో ఐదు దరఖాస్తులు రాగా తహసీల్దార్ ఇమ్రాన్‌ఖాన్ స్వీకరించారు. వేమనపల్లిలో భూ సమస్యలకు సంబంధించిన రెండు దరఖాస్తులు రాగా తహసీల్దార్ రమేశ్ స్వీకరించారు. హాజీపూర్‌లో ఒక దరఖాస్తు రాగా తహసీల్దార్ శ్రీనివాసరావుదేశ్‌పాండే స్వీకరించారు. ఇప్పటి వరకు భూ సమస్యకు సంబంధించిన 11 దరఖాస్తులు రాగా కమిటీ సభ్యులు హాజీపూర్ ఎస్సై గోపతి సురేశ్, ఎంపీవో ఉమర్‌షరీఫ్‌ల సహకారంతో మూడు పరిష్కరించినట్లు తెలిపారు.

ఖాతాదారుల సేవలో యూనివర్సల్ బ్యాంకు



మాట్లాడుతున్న ఇన్‌చార్జి సీఈవో కేవీఎస్ఎన్ మూర్తి

మంచిర్యాలఅగ్రికల్చర్: జిల్లాలో బ్యాంకు ఖాతాదారులకు అన్ని విధాల సేవలలో యూనివర్సల్ బ్యాంకు ముందుంటుందని యూనివర్సల్ కోఆపరేటివ్ అర్బన్ బ్యాంకు చైర్మన్ వినయ్‌కుమార్ అన్నారు. మంచిర్యాల పట్టణంలోని యూనివర్సల్ కో ఆపరేటివ్ అర్బన్ బ్యాంకు 47వ సర్వసభ్య సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా బ్యాంకు చైర్మన్ మాట్లాడుతూ.. 2024–25 అర్ధ వార్షిక సంవత్సరానికి గాను రూ.48.28లక్షలు నికర లాభం వచ్చిందన్నారు. వినియోగదారులకు సాంకేతికపరంగా అందుబాటులో సీసీసీలో ఏటీఎం సౌకర్యం కల్పించామని తెలిపారు. సీనియర్ సిటిజన్స్‌కు ఇతర బ్యాంకుల కన్నా డిపాజిట్లపై ఎక్కువ వడ్డీ ఇస్తున్నామని, సీనియర్ సిటిజన్స్ బ్యాంకుకు రాలేని పక్షంలో వారి ఇంటికి వెళ్లి సర్వీస్ చేస్తున్నామన్నారు. బ్యాంకు ప్రగతి కోసం, అభివృద్ధి కోసం సహాయ సహకారాలు అందిస్తున్న వాటాదారులకు, ఖాతాదారులకు, రిజర్వు బ్యాంకు సహకార శాఖ, మున్సిపల్ అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం బ్యాంకు ఇన్‌చార్జి సీఈవో కేవీఎస్ఎన్ మూర్తి మాట్లాడుతూ.. త్వరలో ఐఎంపీఎస్, యూపీఐ సేవలు అందిస్తామన్నారు. చిన్న, మధ్య తరగతి ప్రజలకు రుణ సదుపాయం కల్పిస్తూ వారి ఆర్థిక ప్రగతికి తోడ్పాటును అందిస్తామన్నారు. బ్యాంకు నుంచి రూపే డెబిట్ కార్డులు, క్యూఆర్ స్కానర్ సౌకర్యం కల్పిస్తున్నామన్నారు. త్వరలో భూపాలపల్లి, గోదావరిఖనిలో బ్యాంకు బ్రాంచీలు నెలకొల్పనున్నట్లు తెలిపారు. సమావేశంలో బ్యాంకు వైస్ చైర్మన్ జీ. పూర్ణచంద్ర రావు, కేఎస్ఎం రావు, జీ. కృష్ణమూర్తి, శ్రీదేవి, బక్కయ్య, ప్రసాద్ రావు, రాజలింగు, భాను ప్రకాశ్, కే. రత్నం, సుశీల, భాగ్యలక్ష్మి, ఐవీఎస్ఎస్ ఆదిత్య, శ్రీపతి శ్రీనివాస్, వాటాదారులు పాల్గొన్నారు.

వేసవిలో నీటి ఎద్దడి లేకుండా చర్యలు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వినోద్

బెల్లంపల్లి: వేసవిలో నీటి ఎద్దడి ఏర్పడకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ అధికారులను ఆదేశించారు. ఏఎంసీ ఏరియాలో ఉన్న క్యాంపు కార్యాలయంలో సోమవారం ఆర్డీవో హరికృష్ణతో కలిసి ప్రభుత్వ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రస్తుతం ఎండలు మండిపోతున్నాయని ఈ క్రమంలో గ్రామాలు, పట్టణాల్లో ఎక్కడెక్కడ తాగునీటి ఇక్కట్లు ఉంటున్నాయో గుర్తించి 28వ తేదీలోగా నివేదికలు తయారు చేయాలని ఆదేశించారు. ప్రణాళిక బద్ధంగా వ్యవహరించాలన్నారు. ఆ తర్వాత నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి పనుల గురించి చర్చించారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ కె.శ్రీనివాసరావు, డీఈ ప్రవీణ్ కుమార్, అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని ఎంపీడీవోలు, ఎంపీవోలు, సిబ్బంది పాల్గొన్నారు.

సబ్సిడీపై అందుబాటులో పనిముట్లు

భీమారం/చెన్నూర్‌రూరల్: 2024–25 సంవత్సరానికి గాను రాష్ట్రీయ కృషి వికాస్ యోజన పథకం కింద 50శాతం సబ్సిడీపై వివిధ రకాల పనిముట్లు అందుబాటులో ఉన్నాయని చెన్నూర్ ఏడీఏ బానోతు ప్రసాద్, భీమారం ఏవో అత్తె సుధాకర్ తెలిపారు. చెన్నూర్ డివిజన్‌లోని చెన్నూర్, కోటపల్లి, భీమారం, జైపూర్, మందమర్రి మండలాల్లో అర్హత కలిగిన మహిళా రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. బ్యాటరీ, మాన్యువల్ ఆపరేటెడ్ స్ప్రేయర్లు 25, పవర్ స్ప్రేయర్లు 25, ఒకటి డ్రోన్, రోటావేటర్లు 20, సీడ్‌కంఫెర్టిలైజర్ డ్రిప్ రెండు, కల్టివేటర్లు 14, పవర్ టిల్లర్లు ఒకటి, బండ్ ఫార్మర్ ఒకటి చొప్పున మొత్తం రూ.21.78లక్షల విలువ గల 90యూనిట్లు ఉన్నాయన్నారు. పనిముట్లు కావాల్సిన రైతులు ఆయా మండలాల్లో వ్యవసాయశాఖ అధికారి కార్యాలయంలో సంప్రదించాలని పేర్కొన్నారు.

దండేపల్లి/మంచిర్యాలరూరల్(హాజీపూర్): వ్యవసాయ యాంత్రీకరణలో భాగంగా మహిళా రైతులకు 50శాతం రాయితీపై వ్యవసాయ పనిముట్లను అందజేస్తున్నట్లు హాజీపూర్ మండల వ్యవసాయాధికారి కృష్ణ, దండేపల్లి ఏవో అంజిత్‌కుమార్ సోమవారం ప్రకటనలో తెలిపారు. మంచిర్యాల డివిజన్ పరిధిలోని మహిళా రైతులకు 14రకాల వ్యవసాయ పనిముట్లను ఇవ్వనున్నట్లు తెలిపారు. ఆసక్తి గల మహిళా రైతులు వ్యవసాయ విస్తరణ అధికారులకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తుతో పాటు ఫొటో, పట్టా పాస్‌బుక్, డీడీ, ఆధార్ కార్డు, బ్యాంక్ పాస్‌బుక్ జిరాక్స్ కాపీలు జత చేయాలని అధికారులు తెలిపారు.

రక్షణ నిత్యకృత్యంగా ఉండాలి

- జీఎం(సేఫ్టీ) చింతల శ్రీనివాస్



మాట్లాడుతున్న జీఎం(సేఫ్టీ) చింతల శ్రీనివాస్

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్ జీఎం కార్యాలయంలోని సమావేశ మందిరంలో సోమవారం రక్షణపై సమీక్ష నిర్వహించగా కార్పొరేట్ సేఫ్టీ జీఎం చింతల శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రక్షణ నిత్యకృత్యంగా ఉండాలని, వ్యక్తిగత రక్షణ పరికరాలు ధరించి ఉద్యోగులు పని చేసేలా చూడాలని తెలిపారు. సేఫ్టీ ఆపరేటింగ్ ప్రొసీజర్స్‌ను పాటించాలన్నారు. ప్రమాదరహిత సింగరేణిగా తీర్చిదిద్దడం కోసం ప్రతి ఒక్కరూ పాటు పడాలన్నారు. సమావేశంలో బెల్లంపల్లి రీజియన్ సేఫ్టీ జీఎం రఘుకుమార్, ఏరియా జీఎం శ్రీనివాస్, ఏరియా ఎస్‌ఓటు జీఎం సత్యనారాయణ, ఓసీపీ పీఓలు టీ.శ్రీనివాస్, ఏవీ రెడ్డి, ఏజెంట్లు రాజేందర్, శ్రీధర్, వెంకటేశ్వర్లు, ఏరియా రక్షణాధికారి శ్రీధర్‌రావు, ఇన్‌చార్జి ఇంజనీర్ సాంబశివరావు పాల్గొన్నారు.

'జన్మభూమి పేరుతో పని భారం'



కార్మికులతో మాట్లాడుతున్న ఏఐటీయూసీ నేతలు

శ్రీరాంపూర్: జన్మభూమి పేరుతో అధికారులు కార్మికులపై పనిభారం మోపుతున్నారని గుర్తింపు సంఘం ఏఐటీయూసీ బ్రాంచీ కార్యదర్శి షేక్ బాజీసైదా తెలిపారు. ఆర్కే న్యూటెక్ గనిపై సోమవారం ఆయన కార్మికులను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ.. ఉదయం మస్టర్ పడ్డ తరువాత కార్మికులను గంటన్నర పాటు సర్ఫేస్‌లో మెటీరియల్ లోడ్ చేసే జన్మభూమి పనులు అప్పగిస్తున్నారన్నారు. ఈ విధానం మానుకోవాలన్నారు. అండర్ గ్రౌండ్‌లో పని చేసే కార్మికులను కంపెనీ అవసరాల నిమిత్తం సర్ఫేస్‌లో తీసుకొంటే వారికి అండర్ గ్రౌండ్ అలవెన్సు చెల్లించాలన్నారు. ఈ సమస్యలపై అధికారులతో చర్చించి పరిష్కరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఆ యూనియన్ ఫిట్ సెక్రెటరీ ఆకుల లక్ష్మణ్, అసిస్టెంట్ ఫిట్ సెక్రెటరీ సందీప్, నాయకులు చంద్రమౌళి, రాజ్‌కుమార్, అజయ్‌లు పాల్గొన్నారు.

■ బొగ్గుబాయి వార్తలు

కార్మికుడికి ఆర్థిక సాయం

జైపూర్: జైపూర్ సింగరేణి థర్మల్ పవర్ ప్లాంటులో కాంట్రాక్టు కార్మికుడిగా పని చేస్తున్న గడ్డం శివసాయి రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. ఈ సందర్భంగా అడ్మిన్ భవన కార్యాలయంలో సోమవారం ఎస్టీపీపీ ఇన్‌చార్జి ఈడీ శ్రీనివాసులు, అధికారులు వైద్యఖర్చుల కోసం రూ.66వేల చెక్కును శివసాయికి అందించారు.

'రియాజ్‌పై చర్య తీసుకోవాలి'

శ్రీరాంపూర్: ఏరియాలోని ఐకే 1ఏ, ఐకే ఓసీపీ గనుల వద్ద అధికారులపై అనుచితంగా వ్యవహరించిన హెచ్ఎమ్మెస్ నాయకుడు రియాజ్ అహ్మద్‌పై చర్యలు తీసుకోవాలని సీఎంఓఏఐ నాయకులు యాజమాన్యాన్ని కోరారు. ఈ మేరకు సోమవారం సీఎంఓఏఐ అపెక్స్ కమిటీ సీనియర్ ఉపాధ్యక్షుడు ఏవీ రెడ్డి, ఏరియా అధ్యక్షుడు వెంకటేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో అధికారులు శ్రీరాంపూర్ జీఎం శ్రీనివాస్‌కు వినతిపత్రం ఇచ్చారు.

వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

మందమర్రిరూరల్: ఎండాకాలంలో వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యాధికారి లోక్‌నాథ్‌రెడ్డి పేర్కొన్నారు. కేకే–ఓసీ ఆవరణలో సోమవారం నిర్వహించిన సమావేశంలో కార్మికులకు వడదెబ్బ తగలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏరియా సేఫ్టీ ఆఫీసర్ రవీందర్, కేకే–ఓసీ మేనేజర్ రామరాజు, యూనియన్ ప్రతినిధులు, అధికారులు, కార్మికులు ఉన్నారు.

ఆన్‌లైన్ బెట్టింగ్ వద్దంటూ ప్రచారం



ఫ్లకార్డులు ప్రదర్శిస్తున్న చిన్నారులు

మంచిర్యాలఅర్బన్: స్థానిక ఎథిక్ అకాడమీ స్కూల్ విద్యార్థులు సోమవారం ఆన్‌లైన్ బెట్టింగ్ వద్దంటూ విస్తృత ప్రచారం చేపట్టారు. ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌లపై అవగాహన కల్పించాలని ఐపీఎస్ అధికారి సజ్జనార్ పిలుపు మేరకు ప్రీ ప్రైమరీ విద్యార్థులు జీవితంలో మంచి ఎంపికలు చేసుకోవటంపై అవగాహన కల్పించేందుకు ముందుకొచ్చారు. బెట్టింగ్‌యాప్‌లపై సంక్లిష్టత గురించి తెలియకపోయినా పిల్లలు ప్రచారంలో శక్తివంతమైన పోస్టర్లు, ఆకర్షణీయమైన నినాదాలు, సానుకూల ప్రవర్తన, ప్రాముఖ్యతను హైలెట్ చేస్తూ ప్రదర్శన చేపట్టారు. స్కూల్ డైరెక్టర్ చరణ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నష్టపరిహారం చెల్లించాలని కలెక్టర్‌కు వినతి



కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

నస్పూర్: ఇటీవల కురిసిన అకాల వర్షానికి దెబ్బతిన్న పంటలకు నష్ట పరిహారం ఇప్పించేలా చర్యలు తీసుకోవాలని కిసాన్‌మోర్చా జిల్లా అధ్యక్షుడు మాదవరపు వెంకటరమణారావు, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు ఎనగందుల కృష్ణమూర్తి డిమాండ్ చేశారు. సమీకృత కలెక్టరేట్ భవన సముదాయంలో కలెక్టర్ కుమార్‌దీపక్‌కు సోమవారం వినతిపత్రం సమర్పించారు. అధికారులు యుద్ధ ప్రాతిపదికన క్షేత్ర స్థాయిలో సర్వే చేయించి, పంట నష్టాన్ని అంచనా వేసి రైతులకు నష్ట పరిహారం అందించాలన్నారు. కార్యక్రమంలో ఓబీసీ రాష్ట్ర నాయకులు మోటపలుకుల తిరుపతి, హాజీపూర్ బీజేపీ మండల అధ్యక్షుడు గడ్డం స్వామిరెడ్డి, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు బొలిశెట్టి అశ్విన్‌రెడ్డి, నాయకులు రాయలి మల్లేశ్, కోటె ప్రశాంత్, అంకం శ్రీనివాస్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

బీసీ గురుకుల డిగ్రీ కళాశాలను జిల్లాకు తీసుకురావాలి

మంచిర్యాలఅర్బన్: చిన్న సమస్యలు, సౌకర్యాలలేమితో నిబంధనలకు విరుద్ధంగా నిర్మల్‌కు తరలించిన బీసీ మహాత్మ జ్యోతిరావుపూలే గురుకుల డిగ్రీ కళాశాలను మంచిర్యాల జిల్లాకు తీసుకురావాలని పీడీఎస్‌యూ విజృంభణ రాష్ట్ర కార్యదర్శి విజయ్ డిమాండ్ చేశారు. నిర్మల్‌లో డిగ్రీ కళాశాలను ఏర్పాటు చేయటం వల్ల మంచిర్యాల జిల్లా విద్యార్థులు సుదూర ప్రాంతాలకు వెళ్లి విద్యను అభ్యసించాలంటే కష్టంగా మారిందన్నారు. మంచిర్యాలలో నెలకొల్పి విద్యాభివృద్ధికి కృషి చేయాలన్నారు.

సంక్షిప్త వార్తలు

వార్షిక పరీక్షలు సజావుగా నిర్వహించాలి

నస్పూర్: జిల్లాలో పదవ తరగతి వార్షిక పరీక్షలు సజావుగా, పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ కుమార్‌దీపక్ అన్నారు. సోమవారం ఆయన నస్పూర్‌లోని ఆక్స్‌ఫర్డ్, సింగరేణి, తీగల్‌పహడ్ జిల్లా పరిషత్ పాఠశాలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాలను సందర్శించారు. కలెక్టర్ మాట్లాడుతూ పరీక్షా కేంద్రాల వద్ద తాగునీరు, విద్యుత్ సరఫరా, ఆర్టీసీ బస్సులు, ప్రశ్న, జవాబు పత్రాల రవాణా, బందోబస్తు అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.

నేడు హుండీ లెక్కింపు

చెన్నూర్: చెన్నూర్ మదనం పోచమ్మ ఆలయంలో భక్తులు హుండీ ద్వారా సమర్పించిన కానుకలను మంగళవారం ఉదయం 11గంటలకు ఆలయ ఆవరణలో లెక్కించనున్నట్లు దేవాదాయ ధర్మాదాయ శాఖ ఈవో రవి తెలిపారు.

వారసంత వేలం

వేమనపల్లి: మండల కేంద్రంలో ప్రతీ గురువారం నిర్వహించే వారసంతను కార్యదర్శి శ్యాంచంద్ వేలం నిర్వహించారు. వేలంలో ముగ్గురు పాల్గొనగా లక్కీ డ్రా తీశారు. మండల కేంద్రానికి చెందిన పోతుగంటి వెంకటి రూ.26,500లకు దక్కించుకున్నారు.

'ఒకే దేశం.. ఒకే ఎన్నిక'పై సదస్సు

కాసిపేట: మండల కేంద్రంలోని తెలంగాణ మోడల్‌స్కూల్లో బీజేపీ ఆధ్వర్యంలో 'ఒకే దేశం.. ఒకే ఎన్నిక'పై సదస్సు నిర్వహించారు. జిల్లా అధికార ప్రతినిధి శ్రీకృష్ణదేవరాయులు మాట్లాడుతూ.. 'ఒకే దేశం.. ఒకే ఎన్నిక' నిర్వహించడం వల్ల ఆర్థిక వ్యవస్థకు నష్టం జరగదన్నారు. సమావేశంలో బీజేపీ మండల అధ్యక్షుడు సంపత్‌కుమార్, ప్రోగ్రాం కన్వీనర్ పెద్దపల్లి శంకర్, సీనియర్ నాయకులు సంతోష్, మండల ప్రధాన కార్యదర్శి రెడ్డి బాలరాజు పాల్గొన్నారు.

న్యాయమూర్తిని కలిసిన రేంజ్ అధికారి

జన్నారం: లక్సెట్టిపేట కోర్టు న్యాయమూర్తి మహ్మద్ అసదుల్ల షరీఫ్‌ను సోమవారం సాయంత్రం ఇందన్‌పల్లి రేంజ్ అధికారి కారం శ్రీనివాస్ మర్యాదపూర్వకంగా కలిశారు. అడవుల రక్షణ, స్మగ్లర్లపై చర్యల గురించి చర్చించినట్లు తెలిపారు.

ఫోన్లు అప్పగింత

దండేపల్లి/మందమర్రిరూరల్: దండేపల్లి, మందమర్రిలో బాధితులు ఫోన్లు పోగొట్టుకొని పోలీస్‌స్టేషన్లలో ఫిర్యాదు చేశారు. పోలీసులు సీఈఐఆర్ పోర్టల్ ద్వారా గుర్తించి మందమర్రిలో ఆరు, దండేపల్లిలో ఒకటి బాధితులకు అందజేశారు. దండేపల్లి ఎస్సై తహసీనొద్దీన్‌కు, మందమర్రి ఎస్సై రాజశేఖర్‌కు బాధితులు కృతజ్ఞతలు తెలిపారు.